**రంగురంగుల బట్టల ముక్కలతో అందమైన విసనకర్ర చేస్తూ, దాన్ని మళ్లీ ఊడదీస్తూ మరింత అందంగా చెయ్యాలని ప్రయత్నం చేస్తూ ఉండేది మా నానమ్మ. ఆ వ్యాపకంలో ఆమెకు ఎంతో తృప్తి ఉండేది. ఆ జ్ఞాపకానికి కొంత మెరుగులు, కల్పన జోడిస్తే ఈ కథ.**

ఎమ్.ఎస్.కె. కృష్ణజ్యోతి

2

# అంకం

చారి పి.ఎస్.





పక్కింట్లో పాప ఏడుపు. అమ్మ బట్టలు బండకేసి బాదుతోంది. హాల్లోనించి టీవీ, 'నీలాల కన్నుల్లో మెలమెల్లగా నిదుర రావమ్మా...' అంటూ పాడుతోంది. ఇన్ని చప్పుళ్ల మధ్యలోనే నేను సీరియస్‌గా లోపలిగదిలో చదువుతున్నాను. ఈ చప్పుళ్లు నా ఏకాగ్రతని చెదరగొట్టలేవు. ఇంకో రెండుపేజీలు పూర్తి అయితే చాప్టర్ అయిపోతుంది. గబగబా చదవడం మొదలుపెట్టాను. బ్రేక్ పడితే నాకు నచ్చదు. అమ్మా, నాన్న ఇద్దరూ ఇంట్లో, బైటి పనులు ఏవైనా వాళ్లే సర్దుబాటు చేసుకొని పూర్తిచేసుకుంటారు. నన్ను పిలవరు. కానీ అటు ఇటుగా ఇంకో పదినిమిషాల్లో నేను తప్పకుండా డిస్టర్బ్ అవుతాను! అందుకనే మరింత వేగంగా చదవడం మొదలుపెట్టాను.

"చిన్నీ, ఇంకాస్త తెలికైన గుడ్డముక్కలు వుంటే ఇవ్వరాదా?" ఎగ్జాక్ట్‌గా నేను లాస్ట్ లైన్ పూర్తి చేసేపాటికి వచ్చేసింది నానమ్మ. రవీంద్రనాథ్ టాగోర్ సైలెంట్ స్టెప్స్ కవిత గుర్తొచ్చింది, 'హి కమ్స్, కమ్స్, ఎవర్ కమ్స్.' అచ్చంగా అలాగే నానమ్మ ఎప్పుడూ వస్తూనే వుంటుంది.

చేతిలో వూడదీసిన విసనకర్ర.

నానమ్మ నన్ను కాదు, మహా మహా మునీశ్వరుల తపస్సు కూడా సునాయాసంగా డిస్టర్బ్ చెయ్యగలదు. పురాణాల్లో రంభ ఊర్వశీ మొదలైన దేవకాంతలు మా నానమ్మ కాలిగోటికి సరిపోరు!

నా స్నేహితుల ఇళ్లలో వుండే పెద్దతరం అవ్వా తాతలకన్నా మా నానమ్మ చాలా పెద్దది. డెబ్భై ఐదు పైన వయసు ఉండొచ్చు. తను ఎప్పుడు పుట్టిందో తనకి తెలీదు. ఆ విషయానికి ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చి గుర్తుంచుకొని వేడుక జరిపేంత కుటుంబంలో తను పుట్టలేదు. తనకి మా నాన్న చాలా లేటుగా పుట్టాడు అంటుంది. మా నాన్నకి నేను కూడా చాలా లేటుగా పుట్టాను. నా చిన్నప్పుడు కాస్త కండతో వుండేది. ఇప్పుడు కిస్మిస్‌పండులాగా ముడుతలు ముడుతలుగా మెత్తగా వుంటుంది. ముతక నేతచీరలు కడుతుంది. అయిదారేళ్ల ముందరివరకూ కొన్ని పనులు చేసేదికానీ, ఇప్పుడు ఏమీ చెయ్యదు. బహుశా చెయ్యాలని చూసినా మా అమ్మ చెయ్యనివ్వదు.

చెయ్యనిస్తే చెయ్యగలదోలేదో తెలీదు! అలాగని ఖాళీగా కూడా వుండదు! గంట గంటకీ ఏదో ఒక వంకన నన్ను కదిలిస్తూ వుంటుంది.

పోస్ట్ గ్రాడ్యుయేషన్ అయిపోయి ఇప్పుడు వుద్యోగం కోసం చదువు కుంటున్నా. గదిలో కదలకుండా పుస్తకంలో మునిగి ఉంటానా, ప్రతి గంటకీ ఒకసారి నానమ్మ ఆయాసపడుతూ వచ్చి ఏదో ఒకటి అడుగుతుంది. తమ్ముడు హాస్టల్ నుంచి సెలవలకి ఇంటికి వచ్చి వున్నా, వాడిని అడగదు. నన్నే అడుగుతుంది. ఆ అడిగే అవసరాలు, విషయాల్లో ఎక్కువసార్లు విసనకర్ర సంగతే వుంటుంది. విసనకర్ర అంటే బజార్లో కొన్నది కాదు, తను చేత్తో తయారుచేసేది.

''చిన్నీ, ఇంకాస్త తేలికైన గుడ్డ ముక్కలు?'' మళ్లీ అదే అడిగింది.

చలికాలం మొదలై మూడునెలలు గడిచాయి. పెద్దపండగ, రథసప్తమి కూడా వెళ్లాయి. ఉదయంపూట పొగమంచు ఇంకా పడుతూనే వుంది. నానమ్మ చలికి పాత స్వెటర్ వేసుకొని, చిన్న గాలికి రాలిపడిపోయే పండుటాకులా సన్నగా వణుకుతోంది. విసనకర్ర కోసం పేలికలు అడుగుతుంటే, చాలాసేపటి నుంచీ ఇస్తా, ఇస్తా అని చెబుతూనే ఇవ్వకుండా తిప్పిస్తున్నాను.

'ముసలామె అడగ్గానే ఇచ్చేస్తే విసిగించదు కదా,' అనిపిస్తుంది బైటవాళ్లకి. కానీ ఇచ్చాక ఇంకేదో గుర్తొస్తుంది తనకి. ఏదీ లేకపోతే గంటకోసారి ఊరకే ఒకసారి వచ్చి నా మొహంవంక తేరిపార చూస్తుంది.

ఏదైనా అడగ్గానే ఇవ్వలేదని ఏమీ అనుకోదు. అయిదోసారి, ఆరోసారి అడిగేప్పుడు కూడా మొదటిసారి అడిగినట్లే అడుగుతుంది. నన్ను పట్టించుకోలేదే అని ఫిర్యాదులు చెయ్యదు. ఇంక వెతికి ఇవ్వక తప్పదు అని చెక్క అల్మారాలోంచి చున్నీలు, జరీ జాకెట్ గుడ్డముక్కలు, పంజాబీ డ్రెస్సుల్లో మిగిలిపోయిన పనికిరాని రంగుపేలికలు తీసి ఇచ్చాను. ఎరుపు, పచ్చ, నీలం రంగుల బట్టముక్కలు బాల్కనీలో పూసిన పువ్వుల్లా వున్నాయి. నానమ్మ అవన్నీ తీసుకుని పోగులా పక్కన పెట్టుకుని మంచం మీద కూర్చుంది. చూసేందుకు గుడిపక్కన గంపలో పూలు పెట్టుకుని అమ్మే అవ్వలాగా వుంది. పూలు గుర్తు వచ్చేప్పటికి చదివే పుస్తకం పక్కన పెట్టి పూలమొక్కల దగ్గరకి వచ్చాను. కాసేపటికి నానమ్మ కూడా మోకాళ్ల మీద చేతులు పెట్టుకుని నిదానంగా బైటకి వచ్చి కుర్చీలో కూలబడి మొక్కల వంక చూస్తూ వుంది. వరండా, ఇంటికి ఉత్తరం వైపు రోడ్డుని ఆనుకుని వుంది. బైట చల్లగాలికి ఒళ్లు తేడా చెయ్యకుండా నానమ్మ తలకి ఊలుగుడ్డ చుట్టుకొని, చలికోటు మీద పాత శాలువా కప్పుకొంది.

''నీ నుదురు అచ్చు మీ తాతగారి నుదురులా వుంటుంది చిన్నీ,'' అసందర్భంగా పోలికల ప్రస్తావన తెచ్చింది. ఈ మాట ఎన్నిసార్లో విన్నాను. నా

నుదురు దానికదే వేరేగా వుండి, తమ్ముడి నుదురు తాతగారి నుదురులా వుంటే బాగుండేది అనుకుంటాను చాలాసార్లు.

“పిట్టలు వచ్చిన చప్పుడే వినపడలేదు నాకు. ఎప్పుడు తినేశాయో,” సంభాషణల్లో ఎక్కువ భాగం నానమ్మ వక్త. నేను కేవలం శ్రోతని.

మొక్కల పక్కన వరండా గట్టుమీద కన్నాలు పెట్టిన మట్టికుండలో ప్రతిరోజూ కొర్రలు వేసి ఉంచుతుంది. సాయంత్రం అయేసరికి ఆ గింజలు కనబడవు. గింజలు ఖాళీ అయిపోయాయి అని సంబరపడుతుంది. పిట్టలు గింజలు తినంగా చూడాలని తనకి సరదా. కానీ, తను ఎప్పుడైనా వాటి కిచకిచలు విని బైటకి రాబోయినా, అవి మనిషి అలికిడికి పారిపోతాయి. వాటిని ఏమార్చేంత జాగ్రత్తగా నానమ్మ నడవలేదు.

“నాకు వాటిని చూడాలని ఇష్టం కానీ, వాటికి నేను ఇష్టం లేదు,” అంటుంది.

“వాటి ప్రైవసీ మనం చెడగొట్టకూడదు కదా,” అంటాను నేను నర్మగర్భంగా. నిజమే అని ఒప్పుకుంటుంది.

మధ్యాహ్నం మొత్తం గుడ్డపేలికల అమరికను సరిచూస్తూ వుంది. నేను ఓ గంట నిద్రపోతాను కానీ, మా నానమ్మ నిద్రపోదు. పైగా ఈ తడవ మంచి జరీ ముక్కలు కూడా ఇచ్చాను. బహుశా ఒక నలభై యాభై సంవత్సరాల కిందట, చిన్న చిన్న పాపలు తప్పనిసరిగా కలలు కని వుంటారు ఇలాంటి పేలికల గురించే, బొమ్మలపెళ్లిలో పెళ్లికూతురి అలంకారాల కోసం. అప్పట్లో బొమ్మలపెళ్లిళ్లు ఉండేవి కదా. కొన్ని పాతసినిమాల్లో చూశాను. బహుశా నానమ్మ కూడా అలాంటి ఒక పాపగా వుండి వుంటుంది. ఇప్పటిదాకా ఆగాల్సి వచ్చింది తన కల నిజం అవడానికి. వాటిని తీసుకొని మొహం చాలా సంతోషంగా పెట్టింది. నానమ్మ సంతోషపడితే పూర్తిగా విచ్చుకున్న తామరపువ్వులా భలే వుంటుంది. బహుశా సంతోషానికో కొలత ఇస్తే, నానమ్మ మొహం అతిపెద్ద యూనిట్ అవుతుంది. ఎప్పటికైనా ఒక యూనిట్ తయారుచేయగలడా మనిషి? హ్యాపీనెస్ ఇండెక్స్, హ్యాపీనెస్ యూనిట్!

‘ఇదిగో మా ఇంట్లో ఇవాళ ఇరవై కేజీల హ్యాపీనెస్ వుంది. ఈ ఆదివారం మా ఇంటికి రండి. మీకు కంచంనిండా హ్యాపీనెస్ వడ్డిస్తాం.’ ఇలాగ కొలత వేసి చెప్పడం ఎవరికైనా సాధ్యం అవుతుందా? ఫిన్లాండ్ దేశంవాళ్లు మూడు సంవత్సరాలుగా హ్యాపీనెస్ ఇండెక్స్‌లో ప్రపంచంలో మొదటిస్థానంలో వున్నారట. ఎలా కొలత వేశారో?! ఎప్పటికైనా ఆ ఫిన్లాండ్ దేశానికి వెళ్లి ఆ దేశస్థుల మొహాలు చూడాలి. నానమ్మ మొహంతో వాళ్లని పోల్చి పరిశీలించాలి.

"మళ్లీ ఈ విసనకర్ర పట్టుకుందా? ఒకపక్క ఆయాసం," మా అమ్మ సణుగుడు. నానమ్మ గురించిన విషయాల్లో అమ్మ సణుగుడు ఏడాది పొడుగునా వుంటుంది. ఒకోసారి నానమ్మకి వినబడేది. ఒకోసారి వినబడేది కాదు. వినబడినా, వినబడకున్నా ఒకేలా ఉండేవి ఆమె ముఖకవళికలు.

"మబ్బేసింది చూశావా చిన్నీ?" వానలు మొదలు అవగానే నాకు చెబుతుంది. నేను తిరిగి మాట్లాడను.

"మీ నాన్న వుద్యోగం బెజవాడలో పడింది. అందుకే నేనూ బెజవాడ రావాల్సి వచ్చింది." ఈ వివరం కూడా ఎన్నిసార్లో విన్నాను.

"మీ నాన్న పుట్టక ముందు, బందర్‌లో వుండేవాళ్లం. అసలు ముందర మన వూరు అదేలే, నీకు తెలుసుగా. ఒక పౌర్ణమి రోజున నేనూ మీ తాతయ్య సముద్ర స్నానానికి వెళ్లాం. జోరున వాన. మంగినపూడి బీచ్‌లో ఒకపూటంతా చిక్కుకొని పోయాం."

చిక్కుకుపోవడం తరవాత ఏమైందో చెప్పదు. ఎప్పుడో ఒకప్పుడు వానలో చిక్కుకొనిపోవడం ఎవరికైనా మామూలేకదా. ప్రత్యేకంగా ఎందుకు ఇప్పుడు ఆ విషయం? అదంతా చాలా రొమాంటిక్ స్టోరీ అయివుంటుందా? తాతయ్య, నానమ్మ రొమాంటిక్ స్టోరీ ఎలా నడిచి వుండివుంటదో. ఈ వయసులో మనవరాలికి అంత కన్నా ఎక్కువ చెప్పదు కదా ఏ మామ్మ అయినా. ఇంకా ఏదైనా ఉందా అని నేను రిక్కించి ఆసక్తిగా వింటాను. కథ అంతమటుకే వచ్చి ఆగిపోతుంది.

వానాకాలం నాలుగునెలలూ విసనకర్ర ఊడదీస్తుంది. కళ్లు మసక. ఒక్కో కుట్టూ లాగుతుంది. దానికోసం బ్లేడు వాడదు. పదునైన వస్తువులు సరిగా ఉప యోగించలేదు. తేలిగ్గా గాయపడుతుంది. ముందర ఒక కుట్టు నా చేత కత్తిరింప చేస్తుంది. తరవాత ఒక్కో కుట్టూ మెల్లమెల్లగా వేళ్లతో లాగుతుంది. దానికోసం ఆ నాలుగు నెలలూ గోళ్లు కత్తిరించదు. కుట్లు లాగుతూ మధ్యమధ్య విశ్రాంతి తీసుకుంటుంది. ఒక కుట్టు లాగడానికి సగటున ఒక పావుగంట సమయం పట్టింది అనుకో, తరవాత గంట రెస్ట్. ఈ పని చేసేప్పుడు దీక్షగా రాళ్లు పగలగొట్టే బక్కపలచని కూలి పనిగత్తెలాగా ఆయాసపడుతుంది.

"మీ తాతయ్య ఎంత చలైనా చొక్కా లేకుండా తిరగ్గలిగేవాడు."

నేను చేతులు లేని టీ షర్టు వేసుకుని వున్నాను. బైటికి వెళ్లేప్పుడు మా అమ్మ స్లీవ్‌లెస్ వద్దు అంటుంది కానీ, ఇంట్లో వేసుకుంటాను.

చలికాలపు రోజుల్లో విసనకర్ర చెయ్యడం మొదలుపెట్టి నాలుగునెలలు అదే పనిమీద వుంటుంది. చొక్కా కాలర్ లోపల వేసేలాంటి మందపాటి బట్ట

గుండ్రంగా కత్తిరించి వుంటుంది. దానికి అమర్చడానికి ఒక అంగుళం వెడల్పు వున్న పల్చటి కర్రపిడి వుంది. అది వెదురుని చీలిస్తే తయారు అయింది. గుండ్రటి నిర్మాణానికి అతికించడానికి వీలుగా పొడుగాటి సంచి కుట్టి వుంటుంది. ఇంతటితో విసనకర్ర అస్థిపంజరం తయారైనట్టే. పిడిని, బట్టముక్కకు పొడుగాటి గుడ్డ సంచితో అనుసంధానం చేస్తుంది. ఆ బట్ట కేంద్రం నుంచి అంచుల దాకా గుడ్డముక్కలతో కుచ్చులు కుడుతుంది. కుట్టుపని కాలంలో అమ్మనో, నాన్ననో, నన్నో ఎవరు వుంటే వాళ్లని దారం ఎక్కించమని అడుగుతూ వుంటుంది. ఏ పనైనా నేను చెయ్యను అనడానికి లేదు. మళ్లీమళ్లీ అదే అడుగుతుంది. చెప్పిన పనేదో చేసేయ్యడమే సుఖం.

సూదితో పనిచేసేప్పుడు మాత్రం బ్లేడుకిలాగా ఇబ్బందిలేదు. ఇది ఎప్పటి నుంచో అలవాటు వున్న పని. దృష్టి అవసరం లేదు. చేతులతోనే నడిచిపోతుంది. నాలుగైదు వరసల కుచ్చులు కుట్టడం పూర్తి అయితే, విసనకర్ర విసురుకోవడానికి రెడీ అయినట్లే. కానీ, తన పనితీరు పట్ల ఒక వరస ఒక్కసారికే తయారుచేసి సంతృప్తి పడదు. ఒక్కో లైను కుట్టాక వూడతీసేస్తుంది. మరింత మంచివో, తేలికైనవో ఇవ్వమని నన్ను అడుగుతుంది. అసలు ఆ కుట్టుపని చేసేప్పుడు చూడాలి, రహస్యంగా ప్రేమలోపడిన కుర్ర అమ్మాయి, రహస్యపు అబ్బాయికోసం పూలరుమాలు కుడుతున్నట్టు మురుసుకుంటూ వుంటుంది.

కుట్టిన తరవాత లోపల బట్ట, లేదా కర్రపిడి కొంచం కూడా పైకి కనబడవు. మొత్తం గుడ్డల లోపల దాచేస్తుంది. పని పూర్తి అయినాక అది చాలా అందమైన వస్తువుగా రూపుదిద్దుకుంటుంది అని చెప్పలేను కానీ, మొత్తానికి ఆ విసనకర్రలో సాధారణ ప్రమాణాలతో పోల్చుకోలేని గొప్పదనం వున్నది అని మాత్రం ఒప్పు కోవాల్సిందే! పూర్తిగా తయారైన తరవాత తను సృజించిన వస్తువుని అపురూపంగా చూసుకుంటుంది.

“చిన్నీ, శివరాత్రి ఎప్పుడు?” చలికాలం నడుస్తూ ఉండగానే నాలుగైదుసార్లు అడుగుతుంది. శివరాత్రి వస్తే చలి శివశివా అని వెళ్లిపోతుంది అని నానమ్మ లెక్క. అప్పుడు విసనకర్ర పనిలోకి దిగాలి. ఈ ఏడాది శివరాత్రి మార్చి మొదటివారంలోనే వచ్చింది. నానమ్మ మర్యాద కాపాడటానికి, నిజంగానే శివశివా అని చలి వెళ్లి పోయింది. వేసవి మొదలు అవగానే, మధ్యాహ్నాలు ఆ విసనకర్రతో విసురుకుంటూ వుంటుంది. చేతులు నొప్పులు పుట్టాయని, చాలా అలసిపోయాననీ నాతో పదేపదే చెబుతుంది.

“మీ తాతయ్యకి చెమట ఎక్కువ. రాత్రుళ్లు కరంటు పోతే నేను తయారుచేసే విసనకర్రతోనే విసురుకునేవాడు. నేను పక్కనే పడుకుని వుండేదాన్ని కదా. నాక్కూడా

విసిరేవాడు. పగలైనా, విసురుకుంటుంటే నేను పక్కకు వెళ్లి కూర్చునేదాన్ని. ఎంత బాగా విసురుతాడో."

విసనకర్రతో బాగా విసరడం ఏమిటో నాకు అర్థంకాదు. ఏది ఏమైనా, అసలు అంత కష్టపడి విసనకర్ర చెయ్యడం ఎందుకు? చేసినదాన్ని వానాకాలం వూడ తియ్యడం ఎందుకు? మళ్లీ కొత్తగా తయారీ మొదలుపెట్టడం ఎందుకు? హాయిగా ఫ్యాన్ వేసుకోవచ్చు కదా. లేదా కాసేపు ఏసీ గదిలోకి వెళ్లొచ్చు కదా. నా హైస్కూల్ నుంచి కాలేజీ దాకా, ఇలా అనుకుంటూ గడిచిపోయింది.

"నిన్నటికన్నా ఈ విసనకర్ర ఇవాళ తేలిగ్గా వుంది చిన్నీ." మే నెల మధ్యాహ్నం అన్నది. కానీ ఎందుకనో దానితో విసురుకోకుండా పక్కన పెట్టింది. మనిషి కాస్త జంకింది. ఓపిక తగ్గితే, వస్తువు బరువు అవ్వాలి కదా. తేలిక ఎలా అయింది?

"రాత్రి మీ తాతయ్య వచ్చాడు. మంగినపూడి బీచ్ చూసొద్దామా మళ్లీ ఒకసారి అన్నాడు. ఈ వయసులో నేను అంత దూరం ఎలా వస్తాను అని అదిలించాను. కార్లో తీసుకుని వెళ్తాను. నీకసలు ప్రయాణం చేసినట్లే వుండదు అని చెప్పాడు."

నానమ్మ ఏదైనా కల వస్తే, అది నిజంగా జరిగినట్లు చెబుతుంది. తాతయ్య వచ్చాడు అని తను అంటే, తాతయ్య కలలోకి వచ్చాడు అని అర్థం చేసుకోవాలి. ఆ సాయంత్రం నానమ్మ మరింత నీరసపడింది. నాన్న నానమ్మని డాక్టర్ దగ్గర చూయించారు. వయసు తగ్గడానికి డాక్టర్లు మందు కనిపెట్టలేదుగా ఇంకా. ఇప్పటికి మార్కెట్‌లో వున్న మందులు ఏవో కొన్ని రాసి పంపేశారు.

*

బెజవాడ ఎండనా మజాకా. నిప్పులు కురుస్తోంది. కానీ, ఏసీ గదిలోంచి బైట హాల్లోకి ఎవరో పిలిచినట్లు వచ్చాను. ఏసీ లోపలి నుంచి బైటికి వస్తే, మంచు కొండమీది నుంచి అగ్నిగుండంలో పడినట్లు వుంటుంది. అసలు ఏసికి అలవాటు పడకపోతే గొడవేలేదు కదా. ఈ ఆలోచన ఇదివరకు ఎప్పుడూ రాలేదు. ఇవాళే ఎందుకో, ఏసీ వదిలేయాలి ఇంక అనుకున్నాను. ఫ్యాన్ వేశాను. ఫ్యాన్ గాలీ నచ్చలేదు. రెండునిమిషాలకే వేడిగా తగిలింది. చిరాకు పుట్టి కట్టేశాను. నానమ్మ విసనకర్ర బల్లమీద కనబడింది. తీసి విసురుకున్నాను. ఏసీ చల్లదనం కన్నా, ఫాను గాలి కన్నా ఇదే బాగుంది. పైగా కుచ్చుల ఒత్తు చూస్తే బరువు అనుకుంటాం కానీ, నిజానికి తేలిగ్గానే వుంది.

పుస్తకం తీశాను. మనసు లగ్నం కాలేదు. గోడకి జారిగిలబడి కళ్లు మూసుకున్నాను. పక్కింటిపిల్ల టాపు లేపేస్తోంది. అమ్మ మిక్సీ ఆన్ చేసింది. ఆకాశంలో ఒక తార అని టివిలో కృష్ణ పాడుతున్నాడు. అన్నీ కరక్టుగా వుండాల్సినట్లే వున్నాయి.

అయినా లోటుగా వుంది!

పరీక్ష డేట్ విద్యార్థికి ప్రేరణ. అంతకుముందు రాని కఠినమైన పాఠాలు కూడా చప్పున వచ్చేస్తాయి. రాజకీయ నాయకునికి ఎలక్షన్ దగ్గరికి వస్తే జోష్ పెరుగుతుంది. అలాంటి స్టిమ్యులస్ ఏదో లోపించింది.

పుస్తకం మూసేసి వరండాలోకి వచ్చాను. ఖాళీగా వున్న మేతకుండ లోపల నాలుగు గింజలైనా దొరక్కపోతాయా అని ఆశాభావంతో వెతుకుతున్న పిచ్చుక టక టకా కుండ అడుగుభాగాన్ని తడుతోంది. నేను రాగానే, నా ఉనికి తెలుసుకొని దూరంగా ఎగిరిపోయింది. కుండీల్లో పువ్వులన్నీ శీతాకాలం పూసేవే. వేసవి జరుగు తోందిగా ఇప్పుడు. పువ్వులు లేవు. నానమ్మ కుర్చీ ఒంటరిగా దిక్కులు చూస్తోంది. లోపలికి వచ్చి గోడమీద నానమ్మ ఫోటో చూశాను. ఎప్పట్లా హాయిగా నవ్వుతోంది.

సాయంత్రం బైటికివెళ్లి మల్లెపూల మొక్క ఒకటి తేవాలి. అదైతే వేసవిలో పూస్తుంది. అలాగే పిట్టలకోసం ధాన్యం గింజలు కూడా.

టేబుల్ మీద వున్న విసనకర్రకు ఈ డిజైన్ ఆఖరి ఆట. ఇప్పుడు దీన్ని మళ్లీ మళ్లీ విప్పి, కొత్త రంగులతో అలంకారం చేసే వాళ్లెవరూ లేరు. నా పనిలో నేను సమయం తెలియకుండా వుంటే, మధ్యమధ్య నన్ను పలకరించేందుకు కూడా ఎవరూ లేరు. మనసు వ్యాకులంగా వుంది. నానమ్మ లేకపోతే బాగోదు అని నాకు ముందుగానే తెలిసి వుంటే బాగుండేది!

అవును, ముందుగానే తెలిసి వుంటే బాగుండేది, డిస్టర్బ్ అవడానికీ రిఫ్రెష్ అవడానికీ మధ్య వ్యత్యాసం.

*సాక్షి 'ఫన్ డే'*
*13 మార్చి 2022*

✻




12 నవంబర్ 1975న పుట్టిన ఎంఎస్‌కె కృష్ణజ్యోతి మొదటి కథ సవారి 2015 జులై తెలుగు వెలుగు మాసపత్రికలో ప్రచురింపబడింది. దాదాపు 25 కథలు రాసారు. కొత్త పండుగ కథాసంపుటి ప్రచురించారు. విజయవాడ ఎస్ఆర్ఆర్ కాలేజీలో అధ్యాపకురాలు.

*చిరునామా: ఎస్ఎఫ్-1, కెవిఆర్ టవర్స్, గణేష్ స్ట్రీట్, ప్రసాదంపాడు, విజయవాడ 521 108 ఫోన్: 91107 28070*
***mskkrishnajyothi@gmail.com***